
# నాకు తెలియని నాన్న

కంచుమర్తి వెంకటేశ్వరరావు



నాన్న ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడు ? అతనికి నేనేదైనా లోటు చేస్తున్నానా రిటైరయినప్పటినుండి కంటికి రెప్పలా చూస్తున్నానే .

ఒక ప్రైవేటు కంపెనీలో ఎకౌంట్స్ ఆఫీసరుగ ఉద్యోగం చేస్తూ అక్కయ్యలిద్దరి పెళ్ళిళ్ళు చేసాడు. నన్ను చదివించి ఒకింటివాడిని చేసాడు. అమ్మ పోయింతర్వాత తనే తల్లి, తండ్రియై మమ్మల్ని ముద్దుగా చూస్తూ ఏ ఇబ్బంది కలగకుండా పెంచాడు.

అటువంటి నాన్నకు అతను రిటైరయిన తర్వాత కొడుకుగా, నా బాధ్యతగా ఏ లోటు రానివ్వకుండా జీతం రాగానే నెల నెలా చేతి ఖర్చుకు ఎంతో కొంత ఇస్తున్నాను శైలజ కూడా నాన్నను మామయ్యగా కాకుండా తన తండ్రిలా చూస్తుంది రాజాకు తాతంటె ఎనలేని ప్రేమ నా దగ్గరకంటె రాజాకు నాన్న దగ్గరే చనువెక్కువ ఎక్కడకు వెళ్ళాలన్నా రాజాను తీసుకెళుతుంటాడు

మరి నాన్న ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడు ?

వారం రోజుల క్రితం ఆఫీసుకని బయలు దేరుతుంటె శైలజ గుర్తుచేసింది

"వచ్చే ఆదివారం రాజా పుట్టినరోజు బట్టలు కొనండి ఆలస్యమైతే టైలరు కుట్టనంటాడు"

రాజా పుట్టినరోజు ఈ నెలేనని మరచిపోయి నందుకు నన్ను నేను తిట్టుకున్నాను బట్టలు కొనాలి కానీ నెలాఖరు రోజులు జేబులో పది రూపాయలకు మించి లేవు రాజా పుట్టిన రోజని గుర్తుంటే జీతం రాగానే బట్టలు తీసి ఎలాగో సర్దుకునేవాడిని

ఇప్పుడెలా ?

ఎప్పుడూ ఎవరినీ అప్పు అడగలేదు ఆ అవసరంకూడా కలిగేదికాదు జీతం డబ్బుతో గుట్టుగా కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను భార్యగా శైలజ నా జీవితంలోకి రావడం నిజంగా నేను అదృష్టవంతుడ్ని. ఏదీ కావాలని అడగదు ఇంట్లో ఏ సరుకు నిండుకున్నా వెంటనే తెమ్మని సతాయించదు ఏదోవిధంగా సర్దుకుంటుంది అంతగా అవసరమైతే నేను అడిగితేనే చెప్పేది

రాజాకు బట్టలు కొనాలి

"నాన్నా.. నాకు బెల్‌బాటమ్ ఫేంటు కుట్టించరూ" కాన్వెంటులో ఫోర్తు స్టేండర్డు చదువుతున్న రాజా మొదటిసారిగ ఫేంటు కుట్టించమని సరదా పడుతున్నాడు వాడి సరదాను కాదనలేకపోయాను కనీసం ఎంద రూపాయలుంటె బట్టలు వస్తాయి ఎప్పుడూ అప్పు అడగలేదు కాబట్టి ఎవరిని అడిగినా ఇస్తారు నా కొలీగ్‌ను అడగాలని నిర్ణయించుకున్నాను

ఆ రోజు

ఆఫీసునుండి ఇంటికి వచ్చేసరికి రాజా నాన్న దగ్గర లెసన్స్ చదువుకుంటున్నాడు

"ఒరేయ్ పోస్టుమేన్ ఉదయం దార్లో ఎదురై నీకు లెటరు వచ్చిందని ఇచ్చాడు నా షర్టు జేబులో ఉంది తీసుకో"

నేను గదిలోకి వెళ్ళి నాన్న షర్టు జేబులోంచి లెటరు తీస్తుంటే క్రిందపడిన కాగితాలను చూసాను

నేను ఆశ్చర్యపోయాను

వంద రూపాయల నోట్లు మూడు

రాజాకు బట్టలు కుట్టించడానికి డబ్బు లేక ఎంత అవస్తపడుతున్నానో తెలుసుండీకూడా తన దగ్గర డబ్బుందని చెప్పని నాన్నమీద కోపం వచ్చింది ఒక ఎంద రూపాయలు ఇస్తే ఏం పోయేది

ఈ వయసులో అతనికి ఖర్చులేముంటాయి. ఏది కావాలంటే అది తను తెస్తున్నాను కదా ! ఈ దాపరికాలు ఎందుకు ?

నాన్న మనస్తత్వంమీద అసహ్యం కలిగింది

ఆ నోట్లను మళ్ళీ నాన్న జేబులో ఉంచి బయటకు వచ్చాను

అందరూ కలిసి భోజనం చేయడం అల వాటు కానీ ఆరోజు నాన్న ముఖం చూడాలంటే చిరాకుగా ఉంది

"శైలూ ముందు నాన్నకు, రాజా కు వడ్డించు"

శైలజ నా వైపు అదోలా చూసి మరేం

మాట్లాడకుండా నాన్నకు వడ్డించింది. రాజాను దగ్గర కూర్చోబెట్టుకుని అన్నం తినిపిస్తున్న నాన్నను చూసాను గదిలోంచి. ఒళ్ళు మండిపోయింది.

అంతా కపట ప్రేమ... కాకపోతే, మనవడంటే అంత ప్రేమున్న మనిషైతే బట్టలు కొనమని వందరూపాయలు ఇవ్వొచ్చుకదా !

ఛ..ఛ...నాన్న ఎందుకిలా మారిపోయాడు.

నాన్న భోంచేసింతర్వాత వంట గదిలోకి వెళ్ళాను.

"ఏమిటలా మెతుకులు కెలుకుతున్నారు. ఆఫీసు నుంచి వచ్చినప్పటి నుండి ముభావంగా ఉంటున్నారు ఏం జరిగింది ?"

శైలజ నెమ్మదిగా అడిగింది. బదులు చెప్పకుండా భోజనం అయిందనిపించి గదిలోకి వచ్చేశాను. కిటికీలోంచి చూశాను నాన్న దగ్గర కూర్చుని కబుర్లు చెబుతున్నాడు రాజా. ఒక్క ఉదుటున లేచి టేబిలు మీదున్న పుస్తకాల బేగ్‌ను బయటకువచ్చి రాజామీద పడేలా విసిరేను.

"ఏరా. ఎప్పుడూ కబుర్లేనా .హోంవర్కు ఇవ్వలేదా స్కూల్లో ?"

అంత గట్టిగా ఎప్పుడూ రాజాను కసురుకోలేదు తెల్లబోయిన రాజా భయపడుతూ పుస్తకాలు తీసాడు

"ఇక్కడ కాదు గదిలోకి వచ్చి చదువు "

బిక్కు బిక్కుమంటూ నా వెనుకే గదిలోకి వచ్చాడు రాజా.

* * *

కొలీగ్ దగ్గర వందరూపాయలు తీసుకుని ఆఫీసు నుండి సరాసరి బట్టలషాపుకెళ్ళి బట్టలు కొన్నాను ఇంటికి వెళ్ళి రాజాను టైలరు దగ్గరకు తీసుకెళ్ళాలి గుమ్మంలో అడుగు పెట్టేసరికి నాన్నతో బయటకు వెళ్ళడానికి తయారవుతున్న రాజా కనిపించాడు

"రాజా .నువ్వెక్కడికి తయారవుతున్నావ్ ఒక పావుగంట ఆగు మనిద్దరం టైలరు దగ్గరకు వెళదాం "

నాన్నకు వినిపించేలా చెప్పి తువాలు తీసుకుని బాత్‌రూంలోకి వెళ్ళాను నేను బయటకు వచ్చేసరికి నాన్న వెళ్ళిపోయాడు. కాఫీ తీసుకుని రాజాతో టైలరు దగ్గరకు వెళ్ళి కొలతలు ఇచ్చి రెండ్రోజుల్లో ఇమ్మని చెప్పి ఇంటికొచ్చాను అప్పటికే నాన్న భోంచేసి వరండాలో పేపరు చదువుతున్నాడు

"ఏవండీ మామయ్యగారి టానిక్కు అయిపోయింది రెండ్రోజుల నుండి చెబుతున్నాను తీసుకురమ్మని "

భోజనాల దగ్గర అడిగింది శైలజ

"నా దగ్గర డబ్బులు లేవు జీతం అందిన తర్వాత తెస్తాను రెండ్రోజులు మందులు లేకపోతే మనుష్యులు చనిపోరులే "



కొంచెం గట్టిగా అన్నాను. నా మాటలు నాన్నకు వినిపిస్తాయని తెలుసు.

"ఎందుకిలా ప్రవర్తిస్తున్నారు. ఏమైంది తనకి." అనుకుంది శైలజ స్వగతంగా.

"డబ్బులు లేనప్పుడు బట్టలు ఎలా తీసుకొచ్చారు "

శైలజ అలా అడగడంతో చిర్రెత్తుకొచ్చింది నాకు.

"అందరిలా డబ్బులుంచుకుని లేనట్లు నాటకమాడడం నాకు తెలియదు అప్పుచేసి తీసుకొచ్చాను ఏం నీకుకూడా నా మీద నమ్మకం లేదా... ఇంకా వివరాలు కావాలా "

అనేసి సగం భోజనంలోనే చేతులు కడుక్కుని బయటకు వచ్చాను. నా మాటలు విన్నాడు కాబోలు నాన్న. ఏదో ఆలోచిస్తున్నట్లుగా కూర్చున్నాడు.

గదిలోకివచ్చి చేతిలోకి పుస్తకం తీసుకున్నానేగాని పేజీలు తిప్పలేకపోతున్నాను. భోజనాలయింతర్వాత శైలజ వచ్చి నా ప్రక్కన కూర్చుంటూ, ఏదో అడగబోయింది ఆ అవకాశం శైలజకు ఇవ్వకుండా ముఖం త్రిప్పేసాను

* * *

శనివారం ఆఫీసుకు సెలవుపెట్టి ఇంట్లోనే ఉండిపోయాను ఉదయం పది గంటలకు బజారుకు వెళ్ళి స్వీట్లు కొనుక్కుని వచ్చాను రేపు రాజా పుట్టిన రోజు అంతకుముందే టైలరు దగ్గరనుండి బట్టలు తీసుకొచ్చాను

గదిలోకి వెళ్ళేసరికి స్వీట్లను శైలజ ప్లేటులో పెట్టడం కనిపించింది నేను తెచ్చిన స్వీట్లు టేబిలుమీదే ఉన్నాయి ఇవి ఎవరు తెచ్చారు ? నేనడగలేదు శైలజ ప్లేటును తీసుకుని బయటకు వెళ్ళింది

బయటనుండి నాన్న నన్ను పిలవడంతో గదిలోంచి బయటకు వచ్చాను

నాన్న చేతిలో పేకెట్లు

"ఒరేయ్. .వారం రోజుల క్రితం పెట్టెంతా వెదికితే జాతకాల పుస్తకం దొరికింది. ఈ నెల ఈ శనివారం నీ పుట్టిన రోజు చదువుకునే రోజుల్లో పుట్టిన రోజును ఎంతో సంబరంగా జరుపుకునేవాడివి. పెళ్ళయినప్పటినుండి కుటుంబ సమస్యల్లోపడి ఆ సంగతే మరచిపోయావు. నాకు కూడా గుర్తులేదు.

రిటైరయినప్పటినుండి నువ్వు, కోడలు నన్ను అపురూపంగా చూస్తున్నారు. ఈ వయసులో నేను మీకు భారమే. అయితే ఆ ఆలోచన మీకు ఏనాడూ రాలేదు. అది నా అదృష్టం

వారం రోజుల క్రితం నీ కొడుకు పుట్టిన రోజు గురించి నువ్వు పడుతున్న ఆరాటం గమనించిన నా హృదయంలో ఏదో తీయని భావన కలిగింది—నా కొడుకు పుట్టినరోజు పండుగ మళ్ళీ చూడాలని ఈ చేతుల్తో నా కొడుక్కి బట్టలు ఇచ్చి చాలా సంవత్సరాలైంది నీకు బట్టలు ఇచ్చి నీ పుట్టినరోజున నిన్ను దీవించాలని ఉంది.

నెల నెలా నువ్విచ్చే డబ్బులు నా ఖర్చులు పోగా మిగిలిన వాటితో ఇవి కొన్నాను."

నాన్న బట్టలు నా చేతుల్లో ఉంచాడు.

"శైలజా! ఈ చీర నువ్వు కట్టుకోమ్మా! ఆ పాయసంతీసుకువచ్చి వాడిచేత తినిపించమ్మా."

"రాజా నీ పుట్టినరోజుకు మీనాన్న నీకు బట్టలు కొన్నాడు కదా మీనాన్న పుట్టినరోజు ఈరోజేరా ఈ స్వీట్లు నీకు."

నాన్న రాజాను, నన్ను దగ్గరకు తీసుకుని స్వీట్లు తినిపించాడు

సిగ్గుతో తల వంచేసాను నాన్న ముఖం చూడలేకపోయాను.

నాల్రోజుల నుండి నాన్న యెడల ఎంత మూర్ఖంగా ప్రవర్తించాను? నా కొడుకుపుట్టిన రోజు గురించి నేనెలా హడావిడి పడ్డానో అంతకు రెట్టింపుగా మరచిపోయిన నా పుట్టిన రోజును గుర్తుచేసి దీవిస్తున్న నాన్న ఔన్నత్యం ఎంత గొప్పదో ఊహించలేక పోయాను.

ఆ మూడు వందల రూపాయలూ నా కోసమే నాన్న ఉంచారు మరి నేనెలా ఊహించుకున్నాను ?

నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి

నా కళ్ళల్లో నీళ్ళ ఎందుకు నిలిచాయో నేనెందుకు బాధపడుతున్నానో నాన్నకు తెలియదు శైలజకు కూడా తెలియదు నా మూర్ఖత్వాన్ని చెప్పలేను నాల్రోజుల్లో నాలో పెరిగిన కల్మషం పోవాలంటే ప్రాయశ్చిత్తం ఒకటే అదీ నాన్న పాదాల దగ్గరే

"నాన్నా "

నాన్న పాదాలకు నమస్కరించాను

నా కన్నీటి చుక్కలు నాన్న పాదాలను తడిపాయి ★

**అంకితం**

"చిరంజీవి మురళీకృష్ణకు పుట్టినరోజు కానుకగా" — బాబాయి

**-కంచుమర్తి వెంకటేశ్వరరావు**